సాక్షి
ఖమ్మం
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



కొత్త పత్తి వస్తోంది..!
సీజన్ మొదట్లో సాగుచేసిన పత్తి ఇప్పుడిప్పుడే చేతికి వస్తుండగా.. రైతులకు కనీస మద్దతు ధర మాత్రం దక్కడం లేదు.
8లో



అధికారుల తీరు సరికాదు
పీఏసీఎస్ పాలకవర్గాల గడువును పొడిగించే విషయంలో అధికారుల తీరు సరిగ్గా లేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.
8లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఎండ ప్రభావం పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా ఇంజనీర్స్ డే



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపులో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. పలువురు ఇంజనీర్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. జల వనరుల శాఖ ఖమ్మం, కొత్తగూడెం ఎస్ఈలు మంగళపూడి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకూబ్‌తో పాటు అధికారులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, త్వరలో ఇంజనీర్ల అసోసియేషన్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

23న నుంచి 'దివ్య దక్షిణ' రైలుయాత్ర



మాట్లాడుతున్న వెంకటేష్

మధిర: దసరా సెలవుల సందర్భంగా దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను చుట్టివచ్చేలా ఐఆర్‌టీసీ ఆధ్వర్యాన దివ్యదక్షిణ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలు 23న సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుందని ఐఆర్‌టీసీ అసిస్టెంట్ మేనేజర్ టీవీ.వెంకటేష్ తెలిపారు. మధిరలో సోమవారం ఆయన మాట్లాడుతూ 23వ తేదీన సికింద్రాబాద్‌లో మొదలయ్యే రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు తదితర పుణ్యక్షేత్రాలను కలుపుతూ ముందుకు సాగుతుందని చెప్పారు. రైలుకు ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఉన్నందున ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్కరికి స్లీపర్ రూ.14వేలు, థర్డ్ ఏసీ రూ.22,500, సెకండ్ ఏసీ టికెట్ రూ.29,500గా నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్లు, వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో లేదా 96705 99512, 92810 30749, 92819 30714, 92814 95848 నంబర్లలో సంప్రదించాలని వెంకటేష్ సూచించారు.

'విద్యానిధి' దరఖాస్తు గడువు గడువు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మా జ్యోతి బాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధించి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 24వ తేదీ వరకు పొడిగించారు. ఈమేరకు అర్హులైన అభ్యర్థులు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.లక్ష్మణ్ సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లోని సోమవారం అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 28వరకు పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 287 మంది, ఇంటర్ పరీక్షలకు 254 మంది హాజరుకానున్నందున కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, డీఐఈఓ కె.రవిబాబు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి మంగపతిరావు తదితరులు తెలిపారు.

బౌద్ధక్షేత్రం అభివృద్ధికి కార్యాచరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.రమేష్ తెలిపారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యాన సోమవారం ఆయన చరిత్రకారులతో సమావేశమయ్యారు. క్షేత్రం పరిసరాల్లో చేపట్టిన తవ్వకాలు, చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనందున అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకంగా ఆదరణ పెరుగుతుందని తెలిపారు. చరిత్రకారులు అరవింద్, కె.శ్రీనివాస్, చారిత్రక బృందం సభ్యులు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల ముందే మార్కెట్..





మద్దులపల్లిలో పూర్తయిన షెడ్లు (ఇన్‌సెట్) సిద్ధంగా ఉన్న కార్యాలయ భవనం

అయినా.. మద్దులపల్లిలో మొదలుకాని కొనుగోళ్లు

- చెక్‌పోస్టులు, కోల్డ్ స్టోరేజీ ఫీజుల వసూళ్లకే పరిమితం
- ఈ పంట సీజన్‌లోనైనా ప్రారంభించాలని రైతుల డిమాండ్
- ఇంకో పక్క మత్కేపల్లి మార్కెట్ నిర్మాణానికి ఎదురుచూపులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ నిర్మాణం దాదాపు పూర్తయింది. గతంలో పాలకవర్గం సైతం ఏర్పడినా పంట ఉత్పత్తులు కొనుగోలు చేయకపోగా కేవలం చెక్‌పోస్ట్, కోల్డ్ స్టోరేజీ ఫీజుల వసూళ్లకు పరిమితమైంది. మార్కెట్‌లో కార్యకలాపాలు జరగాలంటే 50 మందికి పైగా కమీషన్‌దారులు ఉండాలని తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల పరిధి రైతుల కోసం నిర్మించిన ఈ మార్కెట్‌లో క్రయవిక్రయాలు మొదలైతే రైతుల ఇబ్బందులు తీరడమే కాక ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌పై ఒత్తిడి తగ్గనుంది. ప్రస్తుతం ఖమ్మంలో మోడల్ మార్కెట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన మద్దులపల్లి మార్కెట్‌ను ఈ పంట సీజన్‌లోనే అందుబాటులోకి తీసుకొచ్చేలా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు మరింత అందుబాటులో..

ఉమ్మడి జిల్లాలో 14 వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. ఇటీవల చింతకాని, ముదిగొండ మండలాలకు చింతకాని మండలం మత్కేపల్లి వద్ద మరో మార్కెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడ స్థల సేకరణ ప్రక్రియ నడుస్తోంది. భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డుకు మార్కెటింగ్ శాఖ ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, మద్దులపల్లి మార్కెట్ల పరిధిలో 21 చెక్‌పోస్టులు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, దమ్మపేట వ్యవసాయ మార్కెట్లు, 18 చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయి. అయితే, రైతులకు మరింత చేరువ చూసేలా కొత్త మార్కెట్ల ఏర్పాటుపై దృష్టి సారించారు.

నిర్మాణం పూర్తయినా..

మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌లో షెడ్లు, కార్యాలయాల భవనాల నిర్మాణం పూర్తయింది. గతంలోనే పాలకవర్గాన్ని సైతం నియమించినా కార్యకలాపాలు మాత్రం మొదలుకాలేదు. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నందున మద్దులపల్లిలో లావాదేవీలు మొదలుపెడితే ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల నుంచే కాక జిల్లాలోని ఇతర ప్రాంతాలు, పక్క జిల్లాల రైతులు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. కానీ అవసరమైన 50 మందికిపైగా కమీషన్‌దారులను నోటిఫై చేయకపోవడం, ఇతర కారణాలతో ముందడుగు పడడం లేదు. ఫలితంగా ఇప్పటి వరకు మార్కెట్ ఫీజు, చెక్‌పోస్ట్ ఫీజు మాత్రమే ఆదాయం వస్తోంది.

ఖమ్మంపై ఒత్తిడి తగ్గించేందుకు..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాతోపాటు సమీప జిల్లాలు, ఏపీ నుంచి రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొస్తారు. ఈ మార్కెట్‌పై ఒత్తిడి తగ్గించేందుకు 2018లో ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో మార్కెట్ నిర్మాణాన్ని రూ.19.90 కోట్లతో 23.28 ఎకరాల్లో ప్రారంభించారు. ఇక్కడ ఖమ్మంరూరల్ మండలంలోని 19 గ్రామాలు, తిరుమలాయపాలెం మండలంలోని 25 గ్రామాల రైతులు పండించే మిర్చి, పత్తి, మొక్కజొన్న, పెసలు, కందిపప్పు, మినుములు కొనుగోలు చేయాలనేది అంచనా.

మత్కేపల్లికి ముహూర్తం ఎప్పుడో..

ఖమ్మం మార్కెట్ పరిధిలో ఉన్న చింతకాని, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలోని ముదిగొండ మండలాన్ని విడదీసి నూతనంగా చింతకాని మండలం మత్కేపల్లిలో మార్కెట్‌ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఆగస్టు 2న జీఓ విడుదల చేసింది. ఇందుకోసం 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు అందాయి. తొలుత మత్కేపల్లి రెవెన్యూ పరిధి 41వ సర్వేనెంబర్‌లో ఎనిమిది ఎకరాలను గుర్తించారు. మిగతా భూమిని కూడా గుర్తించి నిర్మాణాలు చేపడితే రెండు మండలాల రైతులకు మేలు జరగనుంది.

అందుబాటులోకి తేవాలి..



మా పంటలు అమ్ముకోవాలంటే ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. మద్దులపల్లిలో మార్కెట్ మంజూరు కావడంతో సంతోషించాం. ఇక్కడ నిర్మాణాలు కూడా పూర్తయినందున మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. తద్వారా మా ప్రాంత రైతులకు కలిసి వస్తుంది.

– నామ అప్పారావు, పాపాయిగూడెం, తిరుమలాయపాలెం మండలం

దూరాభారం తగ్గుతుంది..



మద్దులపల్లి మార్కెట్ అందుబాటులోకి వస్తే ఖమ్మం వెళ్లాల్సిన అవసరం ఉండదు. దూరాభారం తగ్గుతుంది. రవాణా ఖర్చులు కలిసొస్తాయి. ఇక్కడ అన్ని పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలి.

– పల్లె రమేష్, రైతు, పోచారం, కూసుమంచి మండలం

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

- ఎప్పటికప్పుడు పరిశీలన, పరిష్కారం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులు, వినతిపత్రాలకు ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటిప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి దరఖాస్తులు స్వీకరించాక అధికారులతో సమావేశమయ్యారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. కాగా, ఈఈ హౌసింగ్, డీఆర్‌డీఓ, డీపీఓ, డీఎంహెచ్ఓ తదితరులపై పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని సూచించారు. డీఆర్వో పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- వైరా మండలం గన్నవరం క్రాస్‌లోని రెబ్బవరం బస్టాండ్‌ను పునరుద్ధరించాలని స్థానికులు విన్నవించారు.
- వేంసూరు మండలం కందుకూరు రైతులు వరుణ్ అగ్రిటెక్ కంపెనీకి చెందిన బీపీటీ 2782 వరి సాగుతో నష్టపోయినందున కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- బోనకల్ మండలం ఆళ్లపాడుకు చెందిన మరీదు శ్రీను దివ్యాంగుల పింఛన్‌ను పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు.
- చింతకాని మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాలను మధిర డివిజన్‌లోకి మార్చకుండా ఖమ్మం డివిజన్‌లోనే కొనసాగించాలని టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు.

నిస్వార్థంగా సేవలు అందించాలి

గ్రామ పాలన అధికారులుగా నియమితులైన వారు క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. జీపీఓలకు నియామక ఉత్తర్వులు అందజేసిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 299 క్లస్టర్లకు గాను 252 మందికి పోస్టింగ్ ఇచ్చామని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలుపై దృష్టి సారించాలని చెప్పారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సునీల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్లు కేటాయించండి సార్..



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని అల్లీపురానికి చెందిన దివ్యాంగులు బడేసాహెబ్, అజీమ్ కలెక్టర్‌ను కోరారు. గతంలోనే తాము దరఖాస్తు చేసుకున్నందున దివ్యాంగుల కోటా ప్రకారం ఇళ్లు ఇవ్వాలని విన్నవించారు.

ఎస్ఐఆర్ నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

ఖమ్మం సహకారనగర్: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో సమీక్షించారు. 2002 తర్వాత ఓటర్ జాబితా సవరణ జరగనుండగా, మాస్టర్ ట్రెయినర్ల ద్వారా బూత్ స్థాయి ఉద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వీసీ అనంతరం కలెక్టర్ అనుదీప్ అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. 2002 ఎస్ఐఆర్ తర్వాత ఓటు హక్కు వచ్చిన అందరి వివరాలు ధ్రువీకరించాల్సి ఉంటుందని చెప్పారు. ఖమ్మం ఆర్‌డీఓ నరసింహారావు, ఎన్నికల విభాగం ఉద్యోగులు ఎం.ఏ.రాజు, అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య..

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

గేదెల పంపిణీ ప్రారంభం

'ఇందిరా' డెయిరీలో ముందడుగు



చిన్నబీరవల్లిలో గేదెలతో లబ్ధిదారులు

బోనకల్: మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటులో భాగంగా ముందడుగు పడింది. మహిళలకు రెండేసి పాడిగేదెలు పంపిణీ చేసి పాల సేకరణతో వారి ఆర్థికాభివృద్ధి కోసం డెయిరీని ఏర్పాటుచేస్తున్నారు. ఈమేరకు పలువురు సభ్యులు ఉండగా.. బోనకల్ మండలంలోని వివిధ గ్రామాల్లో తొలి విడతగా 25 మంది లబ్ధిదారులకు 50గేదెలు పంపిణీ చేశారు. అధికారులు, లబ్ధిదారులతో కూడిన కమిటీలు ఏపీలోని ద్రాక్షారామం వెళ్లి అక్కడ వీటిని కొనుగోలు చేశారు. రూ.2లక్షల విలువ కలిగిన యూనిట్‌తో పాటు దాణా సైతం సోమవారం లబ్ధిదారులకు అందజేసినట్లు ఏపీఎం కొట్టె వెంకటేశ్వర్లు తెలిపారు. రూ.2,100 చెల్లించి మండలంలో 4వేల మంది డెయిరీలో సభ్యత్వం తీసుకోగా, దశల వారీగా గేదెలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

ఆంధ్రా ఇసుకకు బ్రేకులు!

- చింతలపూడి వద్ద 21 లారీలు సీజ్
- అన్నీ సత్తుపల్లి వ్యాపారులవే...
- ఇన్నాళ్లూ లక్షల టన్నుల ఇసుక అక్రమ రవాణా



చింతలపూడి మార్కెట్‌యార్డ్‌లో ఉంచిన ఇసుక లారీలు

సత్తుపల్లి: ఏపీ నుంచి తెలంగాణలోకి గోదావరి ఇసుక రవాణాకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లే కనిపిస్తోంది. అయితే, జిల్లా పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారుల తనిఖీలతో ఇది సాధ్యం కాలేదు. ఆంధ్రా – తెలంగాణ ఇసుక మాఫియా మధ్య ఆధిపత్య పోరుతో గుట్టు బయటపడింది. ఏలూరు జిల్లా యర్రగుంటపాడుకు చెందిన ఓ వ్యాపారి లారీలను తెలంగాణలో మరో వ్యాపారి పోలీసులకు పట్టించడంతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇదే సమయాన ఆంధ్రా వ్యాపారి ఇచ్చిన సమాచారంతో డొంక కదలగా మరికొందరి లారీలను ఏలూరు జిల్లా అధికారులు సీజ్ చేశారు.

లక్షల టన్నులు...


గోదావరి ఇసుకను ఆంధ్రా సరిహద్దుగా గ్రామాల్లోని వ్యక్తుల పేరిట కొన్నాళ్ల నుంచి తెలంగాణకు తరలిస్తున్నారు. చింతలపూడి మండలంలోని పలు గ్రామాల వ్యక్తుల పేరిట అనుమతి తీసుకుని లక్షల టన్నుల ఇసుకను సరైన పత్రాలు లేకుండానే తరలించారు. అయితే, ఏపీ అధికారులు తనిఖీ చేయగా సీతానగరం గ్రామస్తుల పేరిట 60 లారీల ఇసుక తరలించినట్లు బయటపడినట్లు తెలిసింది. కాగా, నాలుగురోజుల క్రితం చింతలపూడిలో సత్తుపల్లికి చెందిన 21లారీలను సీజ్ చేశారు. కొవ్వూరు, తాళ్లపూడి, అన్నదేవరపేట, వాడపల్లి, గోపాలపురం రీచ్‌ల నుంచి సత్తుపల్లి పరిసరాలకు గోదావరి ఇసుక ప్రతిరోజు పదుల సంఖ్యలో లారీల ద్వారా చేరుతోంది. ఈ అంశంపై ఖమ్మం జిల్లా అధికారులు కూడా దృష్టి సారించినట్లు తెలిసింది.

రూ.లక్షల్లో దండుకొని..

సత్తుపల్లికి చెందిన యజమానుల ఇసుక లారీలను విడిపిస్తానని గంగారానికి చెందిన ఓ వ్యక్తి రూ.లక్షలు వసూలు చేసి పత్తా లేకుండా పోయినట్లు సమాచారం. దీంతో ఏపీలోని అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే యత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే భారీగా ఇసుక అక్రమ రవాణా కావడంతో అక్కడి అధికారులు చేతులెత్తేసినట్లు సమాచారం. ఏదిఏమైనా నాలుగు రోజుల నుంచి సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ఏపీ గోదావరి ఇసుక అక్రమ రవాణా లేకపోవడంతో స్థానిక ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇదే సమయాన అక్రమార్కులు కృష్ణా నది నుంచి ఇసుక రవాణా చేసేందుకు మార్గాలు వెతుకుతున్నట్లు తెలిసింది. తిరువూరు మీదుగా కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లికి కృష్ణా నది ఇసుకను తెప్పిస్తున్నా గోదావరి ఇసుక మాదిరి నాణ్యత లేకపోవడంతో నిర్మాణదారులు ఆసక్తి చూపడం లేదని సమాచారం.

రజాకార్లతో రణం చేసి..





రైతాంగ పోరాటానికి బాటలు వేసిన ఖమ్మం మహాసభ

- వరుసదాడులతో ఆయుధాలు సమకూర్చుకున్న విప్లవకారులు
- పాల్వంచలో రజాకార్లతో తలపడిన కోయ దళాలు
- గుంపెనలో కమ్యూనిస్టు దళంపై నిజాం సైన్యం దాడి
- సంఘం పోరాటంతో సింగరేణి కార్మికులకు దక్కిన హక్కులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆంధ్ర మహాసభ ప్రభావం ఎక్కువగా ఉండేది. చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, సర్వదేవభట్ల రామనాథం వంటి నాయకులు ఇక్కడ పార్టీని బలోపేతం చేశారు. 12వ ఆంధ్ర మహాసభ 1945లో ఖమ్మంలో సుమారు ఇరవై వేల మందితో జరిగింది. ఈ సభ స్ఫూర్తితోనే నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడగలమనే ధీమా విప్లవకారులకు వచ్చింది. దీంతో 1946 జూలై 4న తెలంగాణ సాయుధ పోరాటం వరంగల్ జిల్లాలోని విస్నూర్ గడి కేంద్రంగా రగులుకుంది. దీంతో ముందుజాగ్రత్తగా ఖమ్మం, మధిర, బోనకల్, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఇల్లెందు, పాల్వంచ, ములకలపల్లి వంటి ప్రాంతాల్లో రజాకార్లు క్యాంపులు ఏర్పాటుచేశారు. గ్రామాల్లోకి కమ్యూనిస్టులు రాకుండా, సంఘాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు.

పాల్వంచలో కోయదళంపై దాడి..

వేంసూరు సంస్థానంలో భూపంపిణీ చేసిన దళాలు తమ తదుపరి కార్యక్షేత్రంగా పాల్వంచ సంస్థానానికి చేరుకున్నాయి. ఇక్కడ 120 మంది ఆదివాసీ/కోయ యువకులతో గెరిల్లా దళం ఏర్పాటు కాగా, భూపంపిణీ మొదలైంది. దాన్ని అణచివేసేందుకు నిజాం సర్కార్ వేయి మంది సైనికులను పాల్వంచ తాలూకాకు పంపింది. పదిహేను రోజుల పాటు జరిగిన పోరులో ఎనిమిది మంది నిజాం సైనికులు చనిపోయారు. అలాగే, గెరిల్లా దళ నాయకుడు ముత్యాలు మృతిచెందగా మరో ఆరుగురిని నిజాం సర్కార్ ఉరి తీసింది. ఆ తర్వాత రజాకార్ దళాలు ములకలపల్లిలో క్యాంపు ఏర్పాటు చేశాయి. పాల్వంచలో నష్టపోయిన కోయ దళాలు ములకలపల్లిలోని రజాకార్ క్యాంపుపై దాడులు చేశాయి. చివరకు బతుకుజీవుడా అంటూ ఈ క్యాంపును ఎత్తివేయాల్సి వచ్చింది.

కార్మిక సంఘం ఏర్పాటు..

సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో 1938లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రహస్యంగా ఏర్పడింది. హెడ్డాఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్న శేషగిరిరావు పోరాటంలో మొదటి అడుగు వేశారు. శేషగిరిరావు నేతృత్వంలో సాయుధ దళాలు రంగంలోకి దిగి కార్మికుల హక్కుల కోసం పోరాడాయి. ఫలితంగా కాంట్రాక్టు విధానం రద్దయి ఉద్యోగులనే గుర్తింపు వచ్చింది. మహిళలు, పిల్లలను గనుల్లో పని చేయించడంపై నిషేధం విధించగా.. ఉపాధి కోల్పోయిన మహిళలకు సింగరేణి పవర్ ప్లాంట్లలో పని కల్పించారు. చివరకు శేషగిరిరావును 1948 ఏప్రిల్‌లో నెల్లిపాక వద్ద నిజాం పోలీసులు కాల్చి చంపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాయుధ రైతాంగ పోరాటం జోరందుకునే సమయంలో 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన 'ఆపరేషన్ పోలో' అనే పోలీస్ చర్యతో నిజాం సర్కార్ కుప్పకూలింది. హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనమైంది. ఆ తర్వాత జరిగిన మలి దశ పోరాటానికి భద్రాద్రి జిల్లా అడవులే కేంద్ర స్థానాలయ్యాయి.

గుంపెన పోరాటం..

అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెనలో 1948లో రజాకార్లకు – సాయుధ పోరాట యోధులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. వట్టికుంట నాగేశ్వరరావు నేతృత్వంలో గుంపెనలో సమావేశమైన 70మంది సభ్యులతో కూడిన దళాన్ని కల్లూరు నుంచి భారీ సంఖ్యలో వచ్చిన రజాకార్లు చుట్టుముట్టారు. దీంతో విప్లవకారులు ప్రాణాలకు తెగించి పోరాడుతూ అడవుల్లోకి వెళ్లిపోయారు. ఈ దాడిలో ఒక గెరిల్లా, మరో ఇద్దరు గ్రామస్తులు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత దళాల నిర్వహణపై కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చారు. సాయుధ దళంలో 20కి మించి సభ్యులు ఉండకూడదనే తీర్మానం చేశారు.

ఆయుధాల సేకరణ..

కృష్ణా జిల్లా నందిగామ తాలూకాలో పరిటాల సమీపాన పోలీస్ హెడ్‌క్వార్టర్‌పై విప్లవకారులు దాడి చేసి ఆయుధాలు సంపాదించారు. ఆ తర్వాత మోటమర్రిలో మిలిటరీ క్యాంపుపైనా దాడి చేశారు. ఆపై మైదాన ప్రాంతాల్లోని జమీందార్ల గడీలు, ఇళ్లపై దాడులు చేస్తూ ఆయుధ సంపత్తి పెంచుకున్నారు. దీంతో గ్రామ దళాలకు బర్మార్లు, గెరిల్లా పోరాటం చేసేవారికి షాట్‌గన్‌లు, ఆపై స్థాయిలో ఉండేవారికి 12 బోర్ రైఫిళ్లు అందుబాటులోకి వచ్చాయి. వీరితో 50 గ్రామాల్లో ప్రత్యేక రక్షక దళాలు ఏర్పడ్డాయి. మరోవైపు గిరిజన ప్రాంతాలకు వెళ్లిన కామ్రేడ్లు 'ఫారెస్టు' జులుంను అడ్డుకుని కోయ ప్రజల నమ్మకం పొందారు. ఫలితంగా 1948 ఏప్రిల్ నాటికి జిల్లాలో సుమారు వేయి మంది కోయ సభ్యులు గెరిల్లా పోరాటంలో భాగస్వాములయ్యారు.

2

క్లుప్తంగా

అండర్ పాస్ ఎత్తు పెంచాల్సిందే..



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మధిర: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా నిర్మిస్తున్న అండర్ పాస్ ఎత్తు పెంచాలని మధిర మండలం నిధానపురం గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు పనులు జరుగుతున్న ప్రదేశం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అండర్ పాస్‌ను 12అడుగులతో నిర్మిస్తుండడంతో ప్రజల రాకపోకలు, రైతులు పంట ఉత్పత్తుల వాహనాలు రావడం ఇబ్బంది అవుతుందని చెప్పారు. ఈమేరకు 20 అడుగులకు పెంచకపోతే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ

మాజీ సర్పంచ్ ఇంటికి సరఫరా కట్

బోనకల్: బోనకల్ మండలం చొప్పకట్లపాలెంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు 2022 నుంచి విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో రూ.53వేల బకాయి పేరుకుపోగా సరఫరా నిలిపివేశారు. అలాగే, మరికొన్ని సర్వీసులను కూడా తనిఖీ చేశారు. ఏఈ మనోహర్, సీహెచ్.రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థినికి బంగారు పతకం



ఎట్టి ప్రియ

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెంకు చెందిన ఆదివాసీ విద్యార్థిని ఎట్టి ప్రియకు బంగారు పతకం లభించింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ నుంచి బీఈడీ పూర్తిచేసిన ఆమె యూనివర్సిటీ స్థాయి ఫలితాలు సాధించడంతో బంగారు పతకం ప్రకటించారు. ప్రియ తండ్రి రమణ ఆమె చిన్నతనంలోనే మృతిచెందగా, తల్లి కోటేశ్వరి కూలీ పనులకు వెళ్తూ చదివించింది. ఈ సందర్భంగా ప్రియను పలువురు అభినందించారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.16కోట్లు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణానికి రూ.16.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపా రు. మండలంలోని పెద్ద గోపవరం - బంజర, కొత్త గోపవరం - బంజర, జమలాపురం - రామాపురం మార్గంలో ఈ నిధులతో రహదారుల నిర్మానం జరుగుతుందని వెల్లడించారు.

'జాలిముడి' మరమ్మతులకు రూ.5.23 కోట్లు

ఖమ్మంఅర్బన్: మధిర మండలం జాలిముడి ఆనకట్ట కెనాల్ మరమ్మతుల కోసం రూ.5.23 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాలిముడి ఆనకట్ట ఎడమ, కుడి ఫ్లాంక్ కెనాళ్ల మరమ్మతులకు ఈ నిధులు కేటాయించింది. అంచనాలు, డిజైన్ రూపకల్పన బాధ్యతను ఖమ్మం చీఫ్ ఇంజనీర్‌కు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ చైర్మన్ల ఫోరం ఏర్పాటు

గౌరవ అధ్యక్షుడిగా హన్మంతరావు



యరగర్ల హన్మంతరావు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ఏర్పాటైంది. రాష్ట్ర ఫోరం తరహాలో ఉమ్మడి జిల్లా ఫోరంను ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 మార్కెట్లకు గాను తొమ్మిది మార్కెట్లకు పాలకవర్గాలు ఉన్నాయి. ఈ మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సమావేశమైన చైర్మన్లు ఫోరం ఏర్పాటు చేసుకున్నారు. ఫోరం గౌరవ అధ్యక్షుడిగా ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హన్మంతరావును ఎన్నికయ్యారు. అలాగే, అధ్యక్షుడిగా బండారు నరసింహారావు(మధిర), ఉపాధ్యక్షులుగా బాగం నీరజ(కల్లూరు), కార్యదర్శిగా దోమ ఆనంద్‌బాబు(సత్తుపల్లి), సహాయ కార్యదర్శిగా టి. సీతమ్మ(భద్రాచలం),, కోశాధికారిగా ఇరుప శ్రీనివాసరావు(చర్ల)ను ఎన్నుకున్నారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విధులు నిర్వర్తిస్తామని హన్మంతరావు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,315	3,000
ఏసీ మిర్చి	14,900	8,000
మిర్చి	8,400	5,000
పత్తి	7,500	5,100

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

కొత్త పత్తి వస్తోంది..!

- ఖమ్మం మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే సరుకు
- ధర కోసం రైతుల ఎదురుచూపులు



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: వానాకాలంలో రైతులు సాగు చేసిన పత్తి చేతికొస్తోంది. జూన్ ఆరంభంలో సాగు చేసిన వారు ఇప్పుడిప్పుడే పత్తితీత మొదలుపెడుతున్నారు. అయితే, మైల పంటగా భావించే మొదటి సరుకును నిల్వ చేయకుండా విక్రయానికే మొగ్గుచూపుతారు. ఈనేపథ్యాన వారం రోజులుగా ఖమ్మం మార్కెట్‌కు 500 – వెయ్యి బస్తాల మేర పత్తి వస్తోంది. అయితే, ధర మాత్రం అంతంత మాత్రంగానే పలుకుతోంది.

దసరా దాటితే జోరు

పత్తి పంట సహజంగా వంద రోజుల్లో చేతికి అందుతుంది. జూన్‌లో సాగు చేసిన పంట తీత ఇప్పుడిప్పుడే మొదలుపెడుతుండగా దసరా తర్వాత జోరందుకునే అవకాశముంది. అయితే, పత్తి క్వింటాకు కేంద్రప్రభుత్వం తేమశాతం ఆధారంగా గరిష్టంగా రూ.8,110 ధర నిర్ణయించింది. కానీ ఆ ధర మార్కెట్‌లో కనిపించటం లేదు. గత ఏడాది పండించిన పంటకు కూడా కనీస మద్దతు ధర దక్కడం లేదు. కొత్త, పాత పత్తికి తేడా లేకుండానే వ్యాపారులు ధర నిర్ణయిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తికి గరిష్టంగా రూ.7,500, మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.5,100గా పలుకుతోంది. నిత్యం 2వేల బస్తాల పత్తి వస్తుండగా ఇందులో సగం కొత్త పంట ఉంటోంది. కానీ పాత పత్తికి సైతం కనీస మద్దతు ధర దక్కక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈక్రమంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టినా నేపథ్యాన ఆ కేంద్రాలు ప్రారంభమైతే మద్దతు ధర దక్కే అవకాశం ఉంది.

కొత్త పత్తిని విక్రయించా..



వానాకాలం ఆరంభంలోనే మూడెకరాల్లో పత్తి వేశా. అధిక వర్షాలతో తొలితీతలో 8బస్తాలే వచ్చింది. ప్రభుత్వం క్వింటాకు రూ.8,110 ధర చెప్పినా వ్యాపారులు రూ.5వేల నుంచి రూ.6 వేలకే కొనుగోలు చేశారు. అదేమంటే మైల పంట అని చెప్పారు. – బి.కొండలు, గోవిందాపురం

నాణ్యతగా ఉన్నా ధర లేదు



అన్ సీజన్‌లో ధర వస్తుందని గత ఏడాది నిల్వ చేసిన పత్తి తీసుకొచ్చా. పంటల పెట్టుబడి కోసం అమ్మకానికి వస్తే కనీస ధర కూడా లేదు. పంట నాణ్యంగా ఉన్నా క్వింటా రూ.6,500కే అడిగారు. అధికారులు స్పందిస్తేనే మేలు జరుగుతుంది. – జి.సత్యనారాయణరెడ్డి, మోతె, సూర్యాపేట జిల్లా

మిర్చి ధర పతనం

- విదేశాలకు ఆర్డర్లు లేకపోవడమే కారణం?
- దేశీయంగా పండుగ ప్రభావం



మిర్చి శాంపిళ్లను పరిశీలిస్తున్న వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర తిరోగమనంలో కొనసాగుతోంది. జూలై ఆరంభం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన మిర్చి ధర ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. ప్రధానంగా విదేశాలకు ఎగుమతి చేసే 'తేజా' రకం మిర్చి ధర్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఓ వైపు విదేశీ ఆర్డర్లు లేకపోవటం, మరో వైపు దేశీయంగా దసరా పండుగ ప్రభావంతో కొనుగోళ్లు లేక ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. అన్ సీజన్‌లో ధర వస్తుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన రైతులు వానాకాలం పంటల సాగు పెట్టుబడి కోసం అమ్మకానికి తీసుకొస్తున్నారు. కానీ వారి ఆశలకు భిన్నంగా ధర పడిపోతుండడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొంత పెరిగినా...

సుమారు 50రోజులుగా మిర్చి ధరలో కొంత పురోగతి కనిపించింది. కానీ ఇప్పుడు తిరోగమనం దిశగా సాగుతుండడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. జూన్‌లో క్వింటా మిర్చి ధర రూ.13 వేల నుంచి రూ.13,500 పలకగా.. జూలైలో రూ.13,900 వరకు పెరిగింది. ఆగస్టు ఆరంభంలో రూ.14వేలకు పెరిగి, 26వ తేదీ నాటికి రూ.15,600కు చేరింది. ఇక ఈనెలారంభం నుంచి మాత్రం తిరోగమనం ప్రారంభమైంది. ఈనెల 1న రూ.15,450, 8న రూ.15,400, 10న రూ.15,200, 11న రూ.15,100గా, 12వ తేదీన రూ.15వేలకు తగ్గి సోమవారం రూ.14,900కు చేరింది. దీంతో నెల వ్యవధిలో క్వింటాకు రూ.700 ధర తగ్గినట్లయింది.

రకరకాల కారణాలతో..

తేజా రకం మిర్చిని చైనా తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. కానీ ఈ ఏడాది పంట సీజన్ నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు లేక ధరలో పురోగతి కానరాలేదు. గత ఏడాది రూ.20వేలు పలికిన ఈ ఏడాది ఓ సమయాన సగానికి పడిపోయింది. సీజన్‌లో సగటున రూ.13 వేలు, చివరలో రూ.10వేలకు తగ్గింది. ఇప్పుడు అన్ సీజన్‌లో ధరలు లేకపోవడం గమనార్హం. విదేశాలకు ఆర్డర్లు లేకపోవడం ఓ కారణమైతే... ఉత్తరాది రాష్ట్రాల్లో దసరా పండుగ సీజన్ మొదలుకావడంతో కొనుగోళ్లు మందగించి ధర్లపై ప్రభావం పడుతున్నట్లు సమాచారం. అయితే, రైతులు మాత్రం వానాకాలం పంటల సాగు పెట్టుబడుల కోసం నిల్వ మిర్చి విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. తద్వారా విక్రయాలు పెరగడం కూడా ధర పతనానికి కారణంగా ఇంకొకొందరు విశ్లేషిస్తున్నారు.

హైవే సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎమ్మెల్యే రాగమయి

ఖమ్మం సహకారనగర్: గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తదితరులతో పాటు వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల రైతులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు రోడ్లు, డ్రెయిన్ల సామర్థ్యం పెంపు అంశాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అభివృద్ధి పనులకు ఆటంకం ఎదురుకాకుండానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈమేరకు హైవే పనులను అడ్డుకోవద్దని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ తొలుత చెప్పినట్లు సర్వీస్ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించకపోతే రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే పీడీ దివ్య, నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా 'సర్దుబాటు' పూర్తయ్యేనా?

నేడు ఎంఈఓలతో అదనపు కలెక్టర్ సమావేశం

ఖమ్మం సహకారగనర్: విద్యాసంవత్సరం ప్రారంభంలో చేపట్టాల్సిన ఉపాధ్యాయుల సర్దుబాటు అనేక ఆటంకాల నడుమ వాయిదా పడుతోంది. ఇటీవల పదోన్నతుల కారణంగా వాయిదా పడగా.. పలు మార్లు డీఈఓలు, అధికారులు కసరత్తు చేసినా ఓ కొలిక్కి రాలేదు. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఆ వెంటనే ఉత్తర్వులు వస్తాయని ఊహించినా ఎంఈఓలతో సమావేశం నిర్వహించాలని డీఈఓగా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ నిర్ణయించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎంఈఓలతో సమావేశం కానున్న ఆమె ఉపాధ్యాయుల సర్దుబాటుపై సమీక్షించనున్నట్లు తెలిసింది. పూర్తిగా స్పష్టత రాకపోవడం, ఇంకా ఖాళీలు ఉండడంతో శ్రీజ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, మంగళవారం జరిగే సమావేశంలో ఒకటి, రెండు నెలల్లో ఏర్పడే ఖాళీలను సైతం పరిగణనలోకి తీసుకుని సర్దుబాటు ప్రక్రియ పూర్తిచేయాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

విద్యార్థులకు శాపంలా ప్రభుత్వ నిర్ణయాలు

విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. బకాయి ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, నాయకులు సోమవారం ఖమ్మంలో ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, వంగూరి వెంకటేష్, మస్తాన్, మంద సురేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిల విషయంలో ప్రభుత్వం మారినా తీరు మాత్రం మారలేదని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినా స్పందించకపోవడం గర్హనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జార్జిరెడ్డి, మడుపల్లి లక్ష్మణ్, సుధాకర్, తిప్పారపు లక్ష్మణ్, శ్యామల, లోకేష్, వినయ్, సురేష్, రాము, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

కల్లూరురూరల్: ఏపీ నుంచి అనుమతి లేకుండా ఇసుక తీసుకొస్తున్న టిప్పర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు కల్లూరు ఎస్సై డి.హరిత తెలిపారు. ఏపీలో టన్నుకు రూ.600 చొప్పున ఇసుక తీసుకుని తెలంగాణలో రూ.1,100 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈమేరకు టిప్పర్ డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు, యజమాని సుబ్బారెడ్డిని అదుపులోకి తీసుకుని ఇసుక సహా టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల్లో తనిఖీలు

ఖమ్మం సహకారగనర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ కార్యక్రమాల అమలుపై స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(సైట్) డైరెక్టర్ విజయలక్ష్మీబాయి తనిఖీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలల్లో ఈనెల 16, 17వ తేదీల్లో తనిఖీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అబ్జర్వర్‌గా ఉన్న విజయలక్ష్మి అభివృద్ధి పనులు, యుడైస్ అమలు, విద్యా ప్రగతి కార్యక్రమాలను తనిఖీ చేయడమే కాక డీఈఓ, అధికారులతో సమీక్షిస్తారు.

చినుకు పడితే వరదే..



శ్లాబ్ పెచ్చులూడిన భవనం, (ఇన్‌సెట్) వరద నీటిని ఎత్తిపోస్తున్న సిబ్బంది

సత్తుపల్లిరూరల్: చినుకు పడితే చాలు అంగన్‌వాడీ కేంద్రంలోకి వరద పోటెత్తుతోంది. ఇప్పటికే భవనం శ్లాబ్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారగా.. ఇప్పుడు వరదతో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి బోడుకాలనీలోని కాకర్లపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం పల్లపు ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షానికే వరండా, గదుల్లోకి నీరు చేరుతోంది. దీంతో బకెట్లతో తోడిబోస్తూ సిబ్బంది అవస్థ ఎదుర్కొంటున్నారు. పాత భవనం కావడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతుండగా ఎప్పుడేం జరుగుతోందనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి అప్పులు పెరగడం, అవి ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎదురవుతుండడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహారావుపేటకు చెందిన పిన్ని ప్రశాంత్ (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పనిచేస్తున్నాడు. ఆయన రూ.26 లక్షల మేర హైదరాబాద్‌కు చెందిన రిషిక మల్లికార్జున్, సురేష్‌కుమార్, రంజిత్‌కుమార్ వద్ద అప్పు చేయగా, తీర్చాలని వారి నుంచి ఒత్తిడి ఎదురైంది. దీంతో ఈనెల 12 రాత్రి స్వగ్రామానికి వచ్చిన ప్రశాంత్ 13వ తేదీన పురుగుల మందు తాగగా ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రశాంత్ ఆదివారం మృతి చెందడంతో ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలలో పాము కలకలం

వైరారూరల్: వైరా మండలం జింకలగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాము కలకలం రేపింది. సాయంత్రం తరగతులు ముగిశాక విద్యార్థులు ఆట వస్తువుల వద్దకు వెళ్లగా అక్కడ పాము కనిపించింది. దీంతో విద్యార్థులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఈమేరకు స్థానికులు చేరుకుని పామును చంపేశారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు చేరాయని తెలుస్తుండగా, శుభ్రం చేయిస్తామని ఉపాధ్యాయుడు బి.పుల్లారావు తెలిపారు.

కారు బోల్తా, నలుగురికి గాయాలు

ముదిగొండ: ఖమ్మం–కోదాడ నేషనల్ హైవేపై ముదిగొండ మండలం వెంకటాపురం సమీపాన ప్రమాదవశాత్తు సోమవారం బోల్తా పడింది. ఖమ్మం నుంచి నాగమ్మ, నరేందర్, బాలకృష్ణ, శేఖర్ కారులో కోదాడ వైపు వెళ్తుండగా టైరు పంక్చర్ కావటంతో బోల్తా పడగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సకోసం అంబులెన్స్‌లో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ హయాంలోనే మహిళా సంక్షేమం

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్



కేక్ కట్ చేస్తున్న దుర్గాప్రసాద్, సౌజన్య నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యాన ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశాక దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళల్ని రాజకీయంగా చైతన్యవంతం చేయాలని ఉద్దేశంతో 1952లోనే కాంగ్రెస్ మహిళా సెల్ ఏర్పాటైందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ పథకాన్ని మహిళల పేరిటే అమలుచేస్తోందని చెప్పారు.

- జిల్లాలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తెలిపారు. వివిధ పార్టీల నాయకులు సింగారపు చంద్రమౌళి, వంగూరస్వామి తదితరులు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్ లకావత్ సైదులు, నాయకులు గజ్జెల్లి వెంకన్న, మూడుముంతల గంగరాజు యాదవ్, దేవత్ దివ్య, రమ, స్వరూప, ఏలూరి రజని, ఊరుకొండ చంద్రిక, బలుసు లక్ష్మి, జంపాల రామకృష్ణ, మేడారపు హరినాథ్, రాచమల్ల నర్సింహారావు, మామిడాల కుమారస్వామి, జంపాల జంపన్న, దూదిపాళ్ల ఉపేందర్, రాచమల్ల హన్మంతరావు, రామవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు సరికాదు..

ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



డీసీఓతో మాట్లాడుతున్న తాతా మధు, పక్కన కూరాకుల, సండ్ర తదితరులు

ఖమ్మంవైరారోడ్: కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధి ప్రాథమిక సహకార సంఘాల సొసైటీల పాలకవర్గాలను పొడిగించే విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఖమ్మంలో డీసీఓ గంగాధర్‌ను సోమవారం వారు కలిసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించాల్సి ఉండగా.. పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇకకైనా పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం పొడిగించాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, భాష బోయిన వీరన్న, కనగాల వెంకటరావు, వీరమోహన్‌రెడ్డి, పాలెపు రామారావు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఎర్రుపాలెం : కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కొణిజర్ల : డీఏఓ పుల్లయ్యకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో కొందరు అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు తవ్వకాలు నిలిపేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సోమవారం ఖమ్మంలో కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్, నల్లమోతు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలకు రైతు భరోసా ఇవ్వాలని..

కొణిజర్ల: పోడు భూమి సాగు చేస్తున్న రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయాలని కొణిజర్ల మండలం రామనరసయ్యనగర్‌కు చెందిన రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్, డీఏఓ ధనసరి పుల్లయ్యకు వినతిపత్రాలు అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకులు పాశం అప్పారావు, కంపసాటి వెంకన్న, పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ సెమినార్ పోటీలు



వనీషాను అభినందిస్తున్న ఎంఈఓ శైలజలక్ష్మి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో సోమవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. ఎన్‌సీఎస్‌సీ కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పోటీల్లో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని చెప్పారు. ఈ పోటీల్లో కె.వనీషా(త్రివేణి), కె.అశ్రీత్ రామ్ (హార్వెస్ట్), పి.లేఖ(రిక్కాబజార్), బి.శివసాయి రామ్(నయాబజార్) విద్యార్థులు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, త్రివేణి పాఠశాల విద్యార్థిని కె.వనీషారెడ్డి ప్రథమ స్థానంలో నిలవడంపై త్రివేణి పాఠశాలల అధిపతి గొల్లపుడి వీరేంద్రచౌదరి, త్రివేణి– కృష్ణవేణి విద్యాసంస్థల అధిపతి వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

అటవీ జంతువుల వేటకు కరెంట్ ఉచ్చులు

కామేపల్లి: అటవీజంతువులను వేటాడేందుకు కరెంట్ ఉచ్చులు ఏర్పాటు చేయగా, కామేపల్లి మండలంలో అధికారులు గుర్తించారు. మండలంలోని హరిశ్చంద్రాపురం శివారు పంట చేలల్లో జంతువులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి నేరుగా వైర్లను అమర్చారు. ఈ నేపథ్యాన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ఉద్యోగులు పరిశీలిస్తుండగా ఉచ్చులు బయటపడ్డాయి. దీంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి వైర్లను తొలగించారు. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.